ప్రజాశక్తి
బుధవారం 20 డిసెంబర్ 2023
8 పేజీలు
విశాఖపట్నం
అనకాపల్లి







విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద భారీ మానవహారం చేపట్టిన అంగన్‌వాడీలు

బెదిరేది లేదు

- కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె
- ఎక్కడికక్కడ వంటావార్పు, మానవహారాలు

వార్తలు 8లో..

దక్షిణంలో వైసిపి కార్పొరేటర్ల తిరుగుబాటు

- ఎమ్మెల్యే వాసుపల్లిపై విమర్శలు
- నియోజకవర్గానికి కొత్త అభ్యర్థి కావాలని డిమాండ్



అభివాదం చేస్తున్న అధికార పార్టీకి చెందిన తిరుగుబాటు కార్పొరేటర్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో అధికార వైసిపి కార్పొరేటర్లు ఎనిమిది మంది ఒకేసారి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌పై తిరుగుబాటు చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కాకుండా కొత్త అభ్యర్థిని, అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తిని అధికార వైసిపి తరుపున పోటీకి నిలపాలని మంగళవారం సాయంత్రం ఆ కార్పొరేటర్లంతా డిమాండ్ చేశారు. నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన సమావేశంలో వైసిపి కార్పొరేటర్లు ఉరుకుటి నారాయణరావు (29వ వార్డు), కోడూరు అప్పలరత్నం (30వ వార్డు), బిపిన్ కుమార్ జైన్ (31వ వార్డు) విల్లూరి భాస్కరరావు (35వ వార్డు) మాసిపోగు మేరీజోన్స్ (36వ వార్డు), చెన్నా జానకిరామ్ (37వ వార్డు) కోడిగుడ్ల పూర్ణిమ (41వ వార్డు), ఆళ్ల లీలావతి (42వ వార్డు), పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే గణేష్ కుమార్ వ్యవహార శైలి నచ్చక దక్షిణ నియోజవర్గానికి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు కందుల నాగరాజు (32వ వార్డు), మహమ్మద్ సాధిక్ (39వ వార్డు) వైసిపిని వీడి ఇతర పార్టీలకు వెళ్లారని, వార్డుల నుంచి కార్పొరేటర్లు తీసుకువచ్చే ప్రజా సమస్యలను ఎమ్మెల్యే ఏమాత్రమూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆయన వల్ల కార్పొరేటర్లుగా మిగతా 2లో..

21న చింతపల్లికి సిఎం రాక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి గురువారం పర్యటించనున్నారు. ఆ రోజు ఉదయం 9:00 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 9:50 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 10:00 గంటలకు విశాఖపట్నం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 10:30 గంటలకు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం చౌడుపల్లి గ్రామానికి చేరుకుంటారు. అక్కడ నుంచి మిగతా 2లో..

1న జీతాలు చెల్లించండి : యుటిఎఫ్

వార్త 2లో..

వేతన బకాయి చెల్లించాలని ఆందోళన

వార్త 3లో..

టిడిపిలో అంతర్గత పోరు

యువగళంలో బయటపడ్డ అసంతృప్తి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : జిల్లాలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సమయాన ఆ పార్టీలో అంతర్గత పోరు బయటపడింది. నాయకత్వం మధ్య సమన్వయలేమి, ఆధిపత్యం, బలప్రదర్శన వంటి పోకడలు ప్రస్ఫుటంగా వ్యక్తమయ్యాయి. మిత్ర పార్టీల నాయకుల మధ్య ఆధిపత్యపోరు వుండగానే, మరోవైపు అనకాపల్లి ఎంపీ టిక్కెట్ విషయమై కొత్త సమస్యలు ముందుకురావడం టిడిపికి తలనొప్పిగా మారింది. మాజీ మంత్రి, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా పోటీచేయాలని భావిస్తున్నారు. ఎంతో కాలంగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న తనకు ఎంపీ టిక్కెట్ వస్తుందన్న ఆశాభావంతో విజయ్ వున్నారు. యువగళం పాదయాత్రలో ఆయనకు కీలకమైన బాధ్యతలను పార్టీ అప్పగించింది. జిల్లాలోని టిడిపి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

దక్షిణంలో వైసిపి కార్పొరేటర్ల తిరుగుబాటు

తాము పలు అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వెలిబుచ్చారు. ఎమ్మెల్యే తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలను కార్పొరేటర్లు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. అయితే తాము వేరే పార్టీకి వెళ్లేది లేదని, 2024 ఎన్నికల్లో తిరిగి వైసిపిని అధికారంలోకి తేవడానికి తామంతా గట్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అధికార వైసిపి కార్పొరేటర్లు నిర్వహించిన ఈ సమావేశం ఎమ్మెల్యే గణేష్ కుమార్‌కు రాజకీయంగా గట్టి దెబ్బ అని చెప్పవచ్చు. రానున్న రోజుల్లో దక్షిణ నియోజకవర్గం వైసిపిలో ఎటువంటి మార్పులు చోటు చేసుకుంటాయో తెలియాల్సి ఉంది.

21న చింతపల్లికి సిఎం రాక

రోడ్డు మార్గంలో 10:45 గంటలకు బయలుదేరి చింతపల్లిలోని జిటిడబ్ల్యుఎహెచ్ స్కూల్‌కి వెళ్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తారు. 11.10 గంటలకు అక్కడ నుంచి చింతపల్లి డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. 12 :30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 12:40 గంటలకు హెలీపాడ్ ప్రాంతానికి చేరుకుంటారు. అనంతరం స్థానిక నాయకులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 1:30 గంటలకు చింతపల్లి మండలం చౌడుపల్లి గ్రామం నుంచి బయలుదేరి 2:00 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 2:10 గంటలకు విజయవాడ బయలుదేరి వెళ్తారు.

టిడిపిలో అంతర్గత పోరు

శ్రేణులతో పార్టీపరమైన సంబంధాలూ ఆయనకు వున్నాయి. అయితే అనకాపల్లి నుంచి టిడిపి తరపున ఎంపీగా పోటీ చేయాలని బైరా ఫౌండేషన్ ఛైర్మన్ బైరా దిలీప్ చక్రవర్తి ప్రయత్నిస్తున్నారు. ఆయన యువగళం పాదయాత్రతో ఒక్కసారి తెరమీదకొచ్చారు. స్థానిక నాయకులెవరూ పెట్టనన్ని ఫ్లెక్సీలు పాదయాత్ర పొడవునా ఏర్పాటు చేసుకొని లోకేష్, స్థానిక పార్టీ శ్రేణులను ఆకర్షించే ప్రయత్నం చేశారు. దిలీప్ చక్రవర్తిని పార్టీ అధిష్టానం ప్రోత్సహిస్తున్నట్లు భావించి జిల్లా నాయకత్వం అసంతృప్తి వ్యక్తంచేసింది. చక్రవర్తిని ప్రోత్సహించి తప్పుడు సంకేతాలు పంపవద్దని అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రచారం కూడా సాగింది. యలమంచిలి నియోజకవర్గంలో ఫెక్లీల పోరు ఎక్కువగా కనిపించింది. జాతీయ రహదారి నుంచి యలమంచిలి ప్రవేశ మార్గంలో విజయ్ ప్రత్యేక ఆకర్షణగా స్ర్కీన్‌లు, ఫ్లెక్సీలు పెట్టారు. లోకేష్‌ను అయ్యన్న కుటుంబ సభ్యులు గజమాలతో ఆహ్వానించారు. పాదయాత్రలో దిలీప్ చక్రవర్తి ఫ్లెక్సీలపై చర్చ జరిగింది. బైరా ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలతో దిలీప్ చక్రవర్తి పరిచయాలు పెంచుకోవాలని చూస్తున్నారు. చక్రవర్తిని ప్రోత్సహించడం సరికాదంటూ లోకేష్‌తో అయ్యన్న అనడంతో విజయ్ టిక్కెట్ పట్ల సానుకూలతతో మాట్లాడినట్లు తెలిసింది. జిల్లాలో సాగిన పాదయాత్రలో లోకేష్‌తో పాటు విజయ్ పాల్గొని ఎంపీగా పోటీ చేయబోతున్నానన్న సంకేతాలు ఇచ్చారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మెడికల్ రిప్స్ సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బుధవారం నుంచి తలపెట్టిన సమ్మె పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షులు పివి.సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.స్రవంత్ మాట్లాడారు. 1976లో ఏర్పడిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ ఇంతవరకు అమలు జరగలేదన్నారు. సరికదా కేంద్ర ప్రభుత్వం ఈ యాక్ట్‌కు తూట్లు పొడుస్తోందని తెలిపారు. తక్షణం ఈ యాక్ట్‌ను పునరుద్ధరించాలని, మెడికల్ రెప్రజెంటేటివ్స్‌కు చట్టబద్ధమైన పని విధానాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి మాట్లాడుతూ మందుల ధరలు తగ్గించాలని, అత్యవసర నిత్యవసర మందులను ప్రభుత్వ ఆసుపత్రిలో పేదవారికి ఉచితంగా ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ రంగ మందుల కంపెనీలైన హెచ్ఎల్ లాంటి కంపెనీలను పునరుద్ధరించాలని, మందులు, మందుల పరికరాలపైనా జిఎస్‌టిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు సంజయ్ కుమార్, జాతీయ కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు, జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, కె.కిరణ్ చౌదరి పాల్గొన్నారు.

బాలికా సాధికారతే లక్ష్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బాలికా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ (బిబిజి) ఛైర్మన్ మల్లికార్జున రెడ్డి మంగళవారం నగరంలోని ఓ హోటల్లో మీడియాకు తెలిపారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం రఘుమండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిబిజి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. బిబిజి బంగారు తల్లి అని, 2019లో స్థాపించిన లాభాపేక్ష లేని ఫౌండేషన్ అని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో బాలికల విద్యను ప్రోత్సహించడానికి చేపట్టిందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 2040 నాటికి 20 లక్షల మంది ఆడపిల్లల జీవితాలను మార్చడానికి ఉద్దేశించిదన్నారు.

1న జీతాలు చెల్లించండి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఎలు, సరెండర్ లీవులు తదితర సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ కార్యాచరణ నోటీసును మంగళవారం సాయంత్రం విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్‌కు యూనియన్ తరపున అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించే విధంగా నిబంధనలు ఉన్నప్పటికీ రెండు సంవత్సరాలుగా ఉల్లంఘనకు గురవుతున్నాయన్నారు. 15వ తేదీ వచ్చే వరకూ చాలామందికి జీతాలు చెల్లించడం లేదన్నారు. అందువల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. బ్యాంకు లోన్‌లు కలిగిన వారు సకాలంలో వాయిదాలు చెల్లించనందున పెనాల్టీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పిఆర్‌సి దాని ముందు నాటి డిఎ ఎరియర్లు జనవరి 2024 నుంచి 12 వాయిదాలలో చెల్లిస్తామని జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో హామీ ఇచ్చినప్పటికీ దానికి సంబంధించిన ఎటువంటి ఉత్తర్వులూ ఇప్పటి వరకూ ఇవ్వలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21 వరకూ జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులకు విజ్ఞాపన పత్రాలు అందజేస్తామని, 27న తాలూకా, డివిజన్ కేంద్రాలలో ఆరు గంటల ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. జనవరి 3న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 12 గంటల ధర్నా, 7, 8 తేదీలలో విజయవాడలో 36 గంటల ధర్నా ఉంటాయని తెలిపారు. వాటిని ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శులు రియాజ్, టి.జగన్ పాల్గొన్నారు.



జెసికి కార్యాచరణ పత్రాన్ని అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

స్మార్ట్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రతి పేదవాడికీ మెరుగైన ఉచిత కార్పోరేట్ వైద్యం అందించేందుకు వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీకి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరింత జీవం పోసారని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. మంగళవారం ఆమె పూర్ణ మార్కెట్ మున్సిపల్ స్టేడియం వద్ద స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం ఛైర్మన్ కొల్లి సింహాచలంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రస్తుతం ఉన్న రూ.5 లక్షల పరిధిని రూ. 25 లక్షలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెంచారని తెలిపారు. ఇప్పటికే భయంకరమైన క్యాన్సర్ వ్యాధులకు జగనన్న ప్రభుత్వం ఎంత ఖర్చు అయినా వైద్యం అందిస్తోందని అన్నారు.



ఫరూకీని అభినందిస్తున్న ఖాన్

ఐహెచ్.ఫరూకీకి అభినందనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్. రాష్ట్ర మైనార్టీల ఉపాధ్యక్షులుగా నియమితులైన ఐహెచ్.ఫరూకీని గురుస్థానం స్కూల్ డైరెక్టర్ ఎస్.ఖాన్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతిలో ఫరూకీ ఎంతో కీలకమైన, ప్రధానమైన పాత్ర పోషించారని తెలిపారు. మరింత అధికార పాత్ర పోషించాలంటే త్వరలో ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఫరూకీకి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

రాజకీయంగా అడ్డుకోలేకే వ్యక్తిగత విమర్శలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాజకీయంగా అడ్డుకోలేక తాను అవినీతి బాగోతాలు చేస్తున్నానని వ్యక్తిగత విమర్శలను తనపై చేస్తున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ మేయర్, షాడో మేయర్లు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని విశాఖ ప్రజలు పన్నుల రూపంలో చెల్లిస్తున్న కొన్ని వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని ఆరోపించారు.

కౌన్సిల్ సమావేశాల్లో 300కుపైగా రాటిఫికేషన్ అంశాలు కౌన్సిల్ సభ్యులకు తెలియకుండా ఆమోదం పొందాయన్నారు. దసపల్లా భూముల వ్యవహారంలో వైసిపి ఉత్తరాంధ్ర జిల్లా ఇన్చార్జిలుగా వచ్చిన వారంతా ప్రభుత్వ భూములను ప్రైవేటు భూములుగా మార్చేసి కాజేయాలని చూస్తున్నారని తెలిపారు.

మొదటి నుంచీ ఈ విషయమై తాము పోరాటం చేస్తున్నామన్నారు. వైసిపి నాయకుల వల్ల తనకు ప్రాణ హాని ఉందని తెలిపారు. సమావేశంలో జనసేన మహిళా నాయకులు లక్ష్మి, త్రివేణి పాల్గొన్నారు.

బాలవికాస్ గురువు సత్యప్రభ కన్నుమూత

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అద్భుత బాలవికాస్ గురువు ఇంద్రకంటి సత్య ప్రభ (62) మంగళవారం నగరంలోని తన ఇంటిలో కన్నుమూశారు. శ్రీ సత్య సాయి సేవా సంస్థల విద్యా విభాగం బాలవికాస్‌లో 30 ఏళ్లకు పైగా విశేష కృషి చేసిన సత్యప్రభ వృత్తిరీత్యా రైల్వేలో చీఫ్ సూపరింటెండెంట్‌గా పని చేసి మంచి అధికారిణిగా అందరి ప్రశంసలు అందుకున్నారు. దాదాపు 30 సంవత్సరాలు శ్రీ సత్యసాయి సేవా సంస్థల ద్వారా విద్యా సేవలో, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని వారికి మానవతా విలువలతో కూడిన బాల వికాస్ అభివృద్ధికి కృషి సలిపారు. ఆమె మృతికి విశాఖ జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షులు పిఆర్‌ఎస్ఎన్.నాయుడు సంతాపం తెలిపారు.

21న వేటగాడు ఆడియో విడుదల

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వేటగాడు ఆడియో సీడీని ఈ నెల 21న టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఆవిష్కరిస్తారని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ తెలిపారు. వేటగాడు ఆడియో పోస్టర్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న వైసిపి అరాచక పాలన నేపథ్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను వివరించే క్రమంలో వేటగాడు ఆడియో సీడీని విడుదల చేస్తున్నామన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్



పోటీలను ప్రారంభిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. మంగళవారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు ఈనెల 19 నుంచి 21 వరకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న 26వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా. ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపుతోపాటు చక్కని ఉద్యోగ అవకాశాలు పొందవచ్చుని, శారీరకంగా, మానసికంగా దృఢత్వంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో వికెపిసిపిఐఆర్ చైర్మన్ చొక్కాకుల లక్ష్మి వెంకటరావు , బొడ్డేటి కాశీవిశ్వనాథ్, ,డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, అల్పా కృష్ణ,ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వి రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు రామకృష్ణ నగర్, లలితానగర్‌లలో రూ.75.10లక్షలతో నిర్మించనున్న బిటి రోడ్లు ,ఇతర అభివృద్ధి పనులకు నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు మంగళవారం శంకుస్థాపన చేశారు రామకృష్ణనగర్ చాకలిపేట వద్ద 26వవార్డు వైసిపి ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విశాఖపట్నం స్మార్ట్ సిటీలో ప్రతి వార్డును ఆదర్శనీయంగా అభివృద్ధి చేయడానికిముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని విధాలుగా కృషి చేస్తున్నారన్నారు.ఒక్కో వార్డుకు రూ.ఐదు కోట్ల నుంచి రూ.పది కోట్ల వరకు నిధులు కేటాయించారని, త్వరలో పనులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి కార్పొరేటర్ ముక్క శ్రావణి, జెసిఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీశ్, ఇఇ రత్నాకర్ రెడ్డి, డిఇఇ శ్రీనివాసరాజు, ఎఇఇ నిహారిక, 26వ వార్డు నాయకులు రేపతిరావు, శేషు, నవాబ్, హరి, అమ్మాజీ, విజయ్ పాల్, రామప్రకాష్, గౌస్య, లక్ష్మి, సుశీల, ఫరూక్, రాయ్, చిన్న, రాము పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు జియో ట్యాగింగ్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న బెహరా.

ప్రజాశక్తి -గోపాలపట్నం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో, టిడ్కో ఇళ్లను ఎట్టకేలకు లబ్ధిదారులకు అందించే చర్యలు ఊపందుకోవడంపై జివిఎంసి కోఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం నాయుడు తోట సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లకు ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఎపిడిఒ అధ్వర్యంలో జియోట్యాగింగ్ ప్రక్రియ ప్రారంభించారు. దీంతో నాయుడుతోట టిడ్కో కాలనీ ప్రాంతమంతా లబ్ధిదారులతో కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా లబ్ధిదారులతో బెహరా భాస్కరరావు మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ముఖ్యమంత్రికి అందరూ రుణపడి ఉండాలని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 91, 92 వార్డుల వైసిపి అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, జి అప్పలస్వామినాయుడు, గేదెల మురళీకృష్ణ, కంపర కోటేశ్వరరావు, బల్ల రమణ, నీలాపు శ్రీనివాసరెడ్డి, కంపర రామకృష్ణ, దవల మోహన్, సురేష్, మనోహర్, జగదీశ్, రాపర్తి అప్పారావు, జలగం నాగలక్ష్మి, బోనెల నాగరత్నం, కె. నాగలక్ష్మి పాల్గొన్నారు.

వేతన బకాయి చెల్లించాలని ఆందోళన



ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు నవంబర్ జీతాలను వెంటనే చెల్లించాలని, లేకుంటే చలో అడ్మిన్ ఆందోళన చేపట్టక తప్పదని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్, సిఐటియు గౌరవాధ్యక్షులు ఒవి రావు యాజమాన్యాన్ని హెచ్చరించారు. మంగళవారం సెంట్రల్ స్టోర్ జంక్షన్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో వేతన బకాయి చెల్లించాలని కోరుతూ నిరసన, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఒ.వి.రావు మాట్లాడుతూ ఉక్కు ఉత్పత్తిలో కీలక భూమిక వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యం, వేతనాల చెల్లింపులో అలసత్వం తగదన్నారు.కాంట్రాక్టు కార్మికుల వేతనాల చెల్లింపులో .యాజమాన్యం వైఖరిలో మార్పు రాకపోతే అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని చలో అడ్మిన్ ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు. జి శ్రీనివాసరావు నమ్మి రమణ, కె నారాయణ, పి వరహాలు, యు సోమేష్, చట్టి నర్సింగరావు, ఎన్.కృష్ణ, బి కన్నబాబు. కె.సత్యవతి, ఎ శ్రీను, పైడిరాజు, నమ్మి సోమునాయుడు, నమ్మి చంద్రరావు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

నేడు టిడిపి, జనసేన ఎన్నికల శంఖారావ సభ



మాట్లాడుతున్న మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు


ప్రజాశక్తి -గాజువాక: ఈనెల 20న పోలిపల్లి వద్ద నిర్వహించనున్న టిడిపి, జనసేన ఎన్నికల శంఖారావ సభను. జయప్రదం చేయాలని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు.. మంగళవారం గాజువాక నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశం మాట్లాడుతూ యువగళం ముగింపు యాత్రను విజయవంతం చేసిన పల్లా శ్రీనివాసరావును అభినందించారు. ఎన్నికల శంఖారావసభలో తెలుగుదేశం, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పాల్గొంటారన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, టిడిపి, జనసేన ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేయాలన్నారు. గాజువాక నియోజవర్గ పరిశీలకులు వలవల బాబ్జి మాట్లాడుతూ గాజువాక నుంచి 10వేల మంది కార్యకర్తలు తరలిరావాలన్నారు. నియోజవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశంలో జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు. 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు . పులి వెంకటరమణారెడ్డి, ఎండి రఫీ, నల్లూరి సూర్యనారాయణ, గోపి, కర్రి దశేంద్ర, పప్పు శంకరరావు, సింగూరు అనంత, గోమాడ వాసు, అడుసుమిల్లి.దీప్తి పాల్గొన్నారు.

ఆనందపురం :పోలిపల్లి భూమాత లేఅవుట్‌లో బుధవారం జరగనున్న యువగళం సభను విజయవంతం చేయాలని జనసేన రూరల్ జిల్లా కార్యదర్శి మజ్జి శ్రీను పిలుపునిచ్చారు. చంద్రబాబు, లోకేష్‌తోపాటు పవన్‌కల్యాణ్ సభలో పాల్గొంటారన్నారు జిల్లా కార్యదర్శి మజ్జి శ్రీను, మండల అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు పాల్గొన్నారు.

నేటి యువగళం సభను జయప్రదం చేయండి

భీమునిపట్నం : విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, పోలిపల్లి వద్ద ఈ నెల 20న టిడిపి, జనసేన ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగసభను జయప్రదం చేయాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి రామ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రంస్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో సగం మంది వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలకు టిక్కెట్లు ఇవ్వబోమని సిఎం జగన్ చెప్పడం, పాలనలో వైసిపి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. సమావేశంలో టిడిపి నేతలు మొల్లి.లక్ష్మణరావు, బోడేపూడి దొరబాబు, కె.నాగేశ్వరరావు, చిట్టిబాబు పాల్గొన్నారు

ద్రోణంరాజుకు ఘననివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి అమర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్/ ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర రాజకీయాలపై చెరగని ముద్ర వేసిన నాయకుడు ద్రోణంరాజు సత్యనారాయణ అని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ద్రోణంరాజు సత్యనారాయణ 91వ జయంతిని పురస్కరించుకుని మంగళ వారం స్థానిక ద్రోణంరాజు సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి మంత్రి అమర్‌నాథ్ నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్రోణంరాజు పొలిటికల్ యూనివర్సిటీ వంటి వారన్నారు. కార్యక్రమంలో మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యేలు అదీప్‌రాజు, వాసుపల్లి గణేష్‌కుమార్, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, ద్రోణంరాజు శ్రీవాత్సవ్ పాల్గొన్నారు.

పెందుర్తి : మండలంలోని జుత్తాడ గ్రామంలో ద్రోణంరాజు సత్యనారాయణ 91వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్‌షఫీ ఈ ప్రాంతానికి ద్రోణాల సత్యనారాయణ చేసిన సేవలను కొనియాడారు. కాంగ్రెస్ పెందుర్తి మండలాధ్యక్షుడు ముక్క

పిఎం పాలెం: చంద్రంపాలెం కృష్ణానగర్ కాలనీ సమీపంలోని ద్రోణంరాజు సత్యనారాయణ కల్యాణ మండపం ఆవరణలో ద్రోణంరాజు విగ్రహానికి చంద్రంపాలేనికి చెందిన వైసిపి జిల్లా నాయకులు పిళ్లా సూరిబాబు ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో 7వ వార్డు వైసిపి అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, కుడితి రామారావు, అల్లాడ ఎర్రిబాబు, అల్లాడ లింగేశ్వరరావు

నేరాలు ఘోరాలు

హత్యాయత్నం కేసులో నిందితునికి ఐదేళ్ల జైలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : యువకునిపై హత్యాయత్నం కేసులో నిందితునికి ఐదేళ్ల కఠిన కారాగారాశిక్ష, రూ.ఐదు వేలు జరిమానా విధిస్తూ రెండవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎంవెంకటరమణ మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పైడి పాపారావు అందించిన వివరాలివి. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొబ్బరితోట ప్రాంతంలోని ఎస్‌విపి నగర్‌లో నివాసముంటున్న నిందితుడు కేశం సతీష్ వృత్తిరీత్యా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సతీష్‌పై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీట్ కూడా నమోదై ఉంది..2019 జనవరి 5న ముద్దాయి సతీష్, అదే ప్రాంతానికి చెందిన బాధితుడు సంతోష్ కుమార్‌తో గొడవ పెట్టుకున్నాడు. రాత్రి 8గంటల సమయంలో పదునైన కత్తితో సంతోష్ గొంతుపై బలంగా గాయపరిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రగాయాలతో కెజిహెచ్‌లో చేర్పించిన సంతోష్ ప్రాణాలలతో బయటపడ్డాడు. బాధితుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఐపిసి 307 సెక్షన్ కింద కేసు నమోదు చేసిన టూ టౌన్ పోలీసులు, దర్యాప్తు అనంతరం నిందితుడిపై నేరాభియోగపత్రాలను కోర్టుకు సమర్పించగా, విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

హనుమాన్ సినిమా టీజర్ విడుదల



టీజర్ ఆవిష్కరణలో ఎస్‌టిబిఎల్ యాజమాన్యం, సిబ్బంది

ప్రజాశక్తి -పిఎం పాలెం: కొమ్మాది ఎస్‌టిబిఎల్ థియేటర్‌లో మంగళవారం స్క్రీన్-2పై బాలనటుడిగా అందరికీ సుపరిచితుడైన జాంబిరెడ్డి ఫేమ్ హీరో తేజ నటించిన హనుమాన్ సినిమా ట్రీజర్‌ను డిఎస్‌బి సినిమాస్ యాజమాన్యం ఆవిష్కరించింది. ఈ సందర్భంగా డిఎస్‌బి సినిమాస్ జనరల్ మేనేజర్లు శ్రినిష్, శశి కిరణ్ మాట్లాడుతూ జాంబి రెడ్డి ఫేమ్ హీరో సజ్జ తేజ నటించిన హనుమాన్ సినిమా సంక్రాంతి కానుకగా వచ్చేనెల 12న ప్రపంచవ్యాప్తంగా 10భాషలలో ఒకేసారి విడుదల కానుందన్నారు. దీనికి సంబంధించిన టీజర్ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా విడుదల కాగా, అందులో భాగంగానే విశాఖ జిల్లాలో కొమ్మాది ఎస్‌టిబిఎల్, విశాఖ జగదాంబ థియటర్‌లో విడుదలైందన్నారు. తేజ, అమ్రిత అయ్యర్ హీరోహీరోయిన్లుగా వరలక్ష్మి, వెన్నెల కిషోర్, వినయ్ రాయ్, సత్య ఇతర భారీతారాగణంతో ప్రశాంత్ వర్మ, దర్శకత్వంలో నిరంజన్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రానికి అనుదీప్‌దేవ్ సంగీతాన్ని అందిస్తున్నారని, ఇప్పటికే విడుదలైన పాటలు చిత్రంపై అంచనాలను పెంచేశాయన్నారు. థియటర్ మేనేజర్లు బాలు, మాధవరావు, వెంకటేశ్వరరావు, ఎస్‌టిబిఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి -ఆనందపురం: విద్యార్థుల్లో మేథోశక్తిని వెలికితీయడానికి సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయని తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి నాయుడు అన్నారు. మంగళవారం తర్లువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ ఎస్ఎస్ పద్మావతి పర్యవేక్షణలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యక్తిగతంగా, గ్రూపులుగా రూపొందించిన వైజ్ఞానిక నమూనాలను ప్రదర్శనలో ఉండగా వాటిని తిలకించి, విద్యార్థుల ప్రతిభను సర్పంచ్ నాయుడు ప్రశంసించారు. వ్యక్తిగత విద్యార్థి విభాగంలో బోయపాలెం పాఠశాల, గ్రూపు, ఉపాధ్యాయ విభాగం నుంచి ఆనందపురం పాఠశాల, ఆనందపురం టీచర్ ప.రవిప్రసాద్ జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, బాలి అయ్యప్ప, మండల నోడల్ హెచ్ఎం ఆర్. సన్యాసిరావు , హెచ్ఎం పి. జ్యోతి, పలు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

బాడీబిల్డింగ్ విజేతకు అభినందన


పవన్‌ను అభినందిస్తున్న మేయర్

ప్రజాశక్తి -ఆరిలోవ : సౌత్ గోవాలో ఈనెల 8 నుండి 10వ తేదీ వరకు జరిగిన ఐసిఎన్ ఆల్ ఇండియా బాడీబిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి స్వర్ణపతకం సాధించిన ఆరిలోవ, శ్రీకాంత్‌నగరకు చెందిన కె.పవన్‌ను నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి క్యాంపు కార్యాలయంలో మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించి విశాఖ కీర్తిని ప్రపంచ స్థాయిలో నిలబెట్టడం ఎంతో సంతోషకమన్నారు. గోవాలో జరిగిన పోటీల్లో క్లాసికల్ ఫిట్నెస్‌లో ఒక బంగారుపతకం, రెండు రజత పతకాలను పతకాలను సాధించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం క్రీడలకు ఇస్తున్న ప్రోత్సాహం, ప్రాధాన్యత వల్లే పలువురు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ విశాఖ కీర్తిని ఇనుమండింపజేస్తున్నారన్నారు.

24న పోర్టు పెన్షనర్స్ వనసమారాధన


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చౌదరి అప్పారావు

ప్రజాశక్తి మాధవధార : హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వనసమారాధన ఈ నెల 24న మాధవధార మాధవస్వామి దేవాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు తెలిపారు. మంగళవారం కళింగనగర్‌లోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్యసమావేశంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. హార్బర్, పోర్టు పెన్షన్‌దారులంతా కుటుంబాలతో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అన్నపు నారాయణరావు, ప్రకాశరావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి నృత్యపోటీలకు నేలతేరు కస్తూర్బా విద్యార్థినులు


నృత్య ప్రదర్శనలో ప్రతిభ చూపిన కస్తూర్బా విద్యార్థినులు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని నేలతేరు గ్రామంలో ఉన్న కస్తూరిబాగాంధీ బాలిక విద్యాలయంలోని 15 మంది విద్యార్థులు ఈనెల 21 ,22 తేదీల్లో భోపాల్‌లో జరగబోయే జాతీయస్థాయి నృత్యపోటీలకు ఎంపికయ్యారు. ఆయా పోటీల్లో పాల్గొనేందుకు మంగళవారం ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి బాలరంగ్ నృత్యపోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన నేలతేరు కస్తూర్బా విద్యార్థినులు జాతీయస్థాయి నృత్య పోటీలకు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తమౌతోంది. జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లిన నృత్య కళాకారులైన విద్యార్థినులను మంగళవారం సమగ్ర శిక్ష ఎపిసి బి శ్రీనివాసరావు, జిసిడిఒ షేక్ ఖలీసాబేగం, బాలరంగ్ కోఆర్డినేటర్ శారదాదేవి, పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, ఇతర విద్యార్థులు అభినందించారు.

అడ్డదిడ్డంగా 'అదానీ' పోర్టు వాహనాలు

- రాకపోకలకు స్టీల్ ఉద్యోగులు, ప్రజల అవస్థలు
- తరచూ ప్రమాదాలు... పట్టని అధికారులు


రోడ్డుకు అడ్డంగా అదానీ గంగవరం పోర్టు భారీ వాహనం

ప్రజాశక్తి -గాజువాక : ఆదానీ గంగవరం పోర్టుకు వచ్చే భారీ వాహనాలు రోడ్డు వెంబడి భారీగా, అడ్డగోలుగా పార్కింగ్ చేయడంతో ఈ మార్గంలో ప్రయాణించే స్టీల్ ఉద్యోగులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత యంత్రాంగం పట్టనట్లు వ్యవహరించడంపై ఆందోళన, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే ఆదాని గంగవరం పోర్టు బెర్తులు వల్ల ఒకపక్క విపరీతమైన కాలుష్యం ముంచెత్తి ప్రజలు అల్లాడుతుంటే, మరోపక్క పోర్టుకు వచ్చే భారీ వాహనాలు రోడ్డుపక్కనే అడ్డగోలు పార్కింగ్‌తో అనునిత్యం అవస్థలు తప్పడం లేదు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ప్రయాణించే బాలచెరువు గేటు ఎదురుగా ఆదానీ పోర్టుకు వచ్చే భారీవాహనాలను నిలుపుదల చేయడంతో నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో ఈ మార్గంలో స్టీల్ ఉద్యోగులుతోపాటు స్థానికుల రాకపోకలు అధికంగా ఉండడంతో వాహనరద్దీ విపరీతంగా ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో రోడ్డు పక్కన ఆపిన పోర్టు వాహనాలు సడన్‌గా ప్రారంభించి రోడ్డుకు అడ్డంగా వచ్చేస్తుండడంతో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలు గురయ్యే ఛాన్స్ ఉంది. ఇలాగే పలు ప్రమాదఘటనలు చోటుచేసకున్న సందర్భాలూ ఉన్నాయి. ఇక రాత్రి వేళల్లో పొగమంచు, నల్లగా కమ్మేసిన కాలుష్యంలో ఈ మార్గంలో వచ్చే వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం వేరే చెప్పనక్కర లేదు. రోడ్డుపై ఒకవైపు గోడలా ఆపేసిన వాహనాలు సడన్‌గా కదలడంతో అటుగావెళ్లిన వాహనదారులు గాయాల పాలైన ఘటనలూ ఉన్నాయి. దీనిపై గంగవరం పోర్టు సేఫ్టీ అధికారులక్కు స్టీల్ ప్లాంట్ సేఫ్టీ అధికారులు చెప్పినప్పటికీ, తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోంది. పెదగంట్యాడ, గాజువాక పరిసర ప్రాంతాల నుండి చాలామంది ఉద్యోగులతోపాటు స్థానికులకు నిత్యం ప్రయాణ సంకటంగా ఉన్న గంగవరం పోర్టుకు చెందిన భారీ వాహనాలపై ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఆదానీ పోర్టు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆ రోడ్డుపై ప్రయాణమంటేనే భయం



బాలచెరువు గేటు వైపుగా ఉన్న గంగవరం పోర్టుకు వెళ్లే మార్గంలో ప్రయాణమంటే భయమే. రోడ్డు మధ్యలోనే పోర్టుకు చెందిన భారీ వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. ఎపుడు ఏ వాహనం కదులుతుందో తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి.

పాల అప్పలరెడ్డి, ఎస్ఎంఎస్-2, స్టీల్‌ప్లాంట్

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా..?



రాత్రి సమయంలో ఈ మార్గంలో వీధిదీపాలు లేక, మరోవైపు అడ్డగోలుగా నిలుపుదల చేసిన గంగవరం పోర్టు వాహనాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.ఎటువంటి ఏ వాహనం కదులుతుందో తెలియని స్థితి. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణం

జి అప్పలనాయుడు, ట్రాఫిక్ విభాగం, పెదగంట్యాడ

ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని వెళ్లాల్సిందే



గంగవరం పోర్టు వాహనాలు ఇష్టానుసారం, భారీగా నిలిపేయడంతో ఈ మార్గంలో ప్రయాణమంటే ప్రాణాలకు రక్షణ లేదు. ఎటు నుంచి ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందో తెలియక బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నాం.

ఎస్.శంకర్, సింటర్ ప్లాంట్, పెదగంట్యాడ

సిఎం కప్ బాక్సింగ్ పోటీలు ప్రారంభం


బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న కాయల వెంకటరెడ్డి

ప్రజాశక్తి- సీతమ్మధార : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వైఎంసిఎ దగ్గర మంగళవారం నిర్వహించిన సిఎం కప్ బాక్సింగ్ పోటీలను ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎపి మారిటైమ్ బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి బాక్సింగ్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడా పోటీల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలు, అందరి సహకారంతో మరిన్ని క్రీడా కార్యక్రమాల రూపకల్పన చేస్తామని వెంకటరెడ్డి వెల్లడించారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని అభినందించారు. ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎస్ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ సిఎం కప్ పోటీల నిర్వహణతో క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తి వెల్లివిరిస్తోందని, రాష్ట్రంలో నవయువ ఛాంపియన్‌ల ఆవిర్భావానికి ఈ టోర్నమెంట్ దోహదం చేస్తుందన్నారు. ఈనెల 21న ముగింపు పోటీలు, విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరికీ సర్టిఫికేట్లు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, జిసిసి చైర్‌పర్సన్ స్వాతి రాణి, కెవిఆర్ ఎస్టేట్స్ మేనేజింగ్ పార్టనర్ కాయల సూరారెడ్డి, కాయల రవికృష్ణారెడ్డి, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

అపోలోలో అరుదైన ఆర్థోపెడిక్ సూక్ష్మ శస్త్రచికిత్స

అసోసియేషన్ వార్షిక సమావేశంలో చికిత్సా పత్రాలు సమర్పించిన డాక్టర్ అబ్దుల్‌ఖాన్


డాక్టర్ అబ్దుల్ ఖాన్

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖపట్నం అపోలో ఆసుపత్రి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, విభాగాధిపతి డాక్టర్ అబ్దుల్ ఖాన్ అత్యంత అరుదైన, చాలా సున్నితమైన శస్త్రచికిత్స ఇటీవల ఆసుపత్రిలో నిర్వహించారు. 54ఏళ్ల రోగికి థెరప్యూటిక్ హిండ్‌ఫుట్ ఎండోస్కోపిక్ కాల్కానియోప్లాస్టీ అనే ఆర్థోపెడిక్ సర్జరీని రాష్ట్రంలోనే తొలిసారిగా నిర్వహించి, ఒక్కరోజులోనే రోగిని డిశ్చార్జి చేసిన ఘనత సాధించారు. ఈ అరుదైన ఆపరేషన్‌కు సంబంధించిన చికిత్సా పత్రాలను ఈ నెల 14న లక్నోలో జరిగిన ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ వార్షిక సమావేశం, ప్రొఫెసర్ కేటి ధోలాకియా సిఎంఇలో డాక్టర్ ఎకె.ఖాన్ సమర్పించినట్లు వెల్లడించారు. అసోసియేషన్ వార్షిక సమావేశంలో రాష్ట్రం తరపున డాక్టర్ ఎకె.ఖాన్ ఒక్కరే పాల్గొనడం విశేషం. మడమ నొప్పి, వాపుతో రెండేళ్లుగా బాధపడుతున్న 54ఏళ్ల రోగికి అవిశ్రాంతంగా అనాల్జెసిక్స్, బ్రేస్, ఫిజియోథెరపీ, స్టెరాయిడ్ ఇంజెక్షన్లను ఇచ్చినప్పటికీ ఎటువంటి ఉపశమనం లేకపోవడంతో అపోలో ఆసుపత్రికి వైద్యానికి వచ్చాడు. డాక్టర్ ఎకె.ఖాన్ ఆధ్వర్యంలో అపోలో ఆసుపత్రి ఆర్థోపెడిక్ వైద్యనిపుణుల బృందం ఎంఆర్ఐ స్కాన్ చేసి, మడమ హగ్లండ్స్ వైకల్యాన్ని నిర్ధారించారు. వ్యాధినివారణకు డాక్టర్ ఖాన్ థెరప్యూటిక్ హిండ్ ఫుట్ ఎండోస్కోపిక్ కాల్కానియోప్లాస్టీ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. రోగి బాగా కోలుకుని 24 గంటల్లో డిశ్చార్జ్ అయ్యాడు.దీనికి సంబంధించిన చికిత్సాపత్రాలను ఆర్థోపెడిక్ అసోసియేషన్‌లో సమర్పించిన డాక్టర్ ఖాన్‌ను పలువురు ప్రశంసించి, అభినందించారు.

సిబ్బంది పిల్లలకు 'పద్మపూజిత' స్కాలర్‌షిప్‌లు


స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో చైర్మన్ బసవరాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : విద్యార్థులు కేవలం చదువు ద్వారానే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని పద్మపూజిత ఫౌండేషన్ చైర్మన్ బసవరాజు అన్నారు. మంగళవారం పద్మపూజిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పద్మపూజిత ఆటోఫైనాన్స్ వీల్స్ మార్ట్ సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బంది పిల్లలు 67 మందికి రూ.10 లక్షల స్కాలర్ షిప్‌లను ఫౌండేషన్ చైర్మన్ బసవరాజు అందజేశారు. ఈ సందర్భంగా బసవరాజు మాట్లాడుతూ పద్మపూజిత ఫౌండేషన్ ద్వారా ఏటా సంస్థలోని సిబ్బంది పిల్లలకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌కె ప్రతినిధి రామకృష్ణ, కిరణ్, సాయిబాబు, శ్రీనివాస్, పడాల ప్రసాదు, వేణు, పద్మ పూజిత సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు

ప్రజాశక్తి-సీతమ్మధార : స్థానిక అర్బన్ తహశీల్దార్ కార్యాలయ భవనానికి మరమ్మతులు చేపడుతున్నారు. వర్షాలు కురిసేటప్పుడు శిథిలమైన భవనంలో సిబ్బంది, ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకునితహశీల్దార్ ఆనందకుమార్ ఆధ్వర్యంలో భవనానికి మరమ్మతులు, అన్ని హంగులు, ఆధునికీకరణ చర్యలు చేపడుతున్నారు. సంబంధిత పనులను మంగళవారం పరిశీలించిన తహశీల్దార్, కాంట్రాక్టర్‌కు కొన్ని సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ, సంక్రాంతి నాటికి పనులను పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నా మన్నారు. ఆర్ఐ, విఆర్ఒలు పాల్గొన్నారు.


కాంట్రాక్టర్‌కు సూచనలు చేస్తున్న తహశీల్దార్

కిసాన్ మేళాలో అవార్డుల ప్రదానం





అవార్డులు అందుకుంటున్న ఆర్ఎఆర్ఎస్ శాస్త్రవేత్తలు కెవి.రమణమూర్తి, శ్రీదేవి, ఆదిలక్ష్మి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో మంగళవారం నిర్వహించిన 64వ కిసాన్ మేళా సందర్భంగా వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురిని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్ ప్రశాంతి, ఏడిఆర్ డాక్టర్ జగన్నాథరావు, అతిథుల చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. యుబి రాఘవేంద్రరావు స్మారక అవార్డును సుగర్ ఇండస్ట్రీలో చోడవరం సుగర్ ఫ్యాక్టరీ ఎండి వి.సన్యాసినాయుడుకు, ఆర్ఎల్ నరసింహం స్మారక బెస్ట్ సాయిల్ సైంటిస్ట్ అవార్డును బాపట్ల పూర్వపు అసోసియేట్ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ కే భాస్కరరావుకు, 2022-23లో రికవరీ సాధించడంలో ఇచ్చే అవార్డును పశ్చిమగోదావరి జిల్లా ది ఆంధ్ర సుగర్స్ లిమిటెడ్‌కు, సహకార రంగంలో ఎక్కువ రికవరీ సాధించడంలో ఇచ్చే అవార్డును చోడవరం సుగర్ ఫ్యాక్టరీకి, ఉత్తర కోస్తా మండలిలో మహిళ సైంటిస్టులకు ఇచ్చే అల్లూరి అచ్చయ్యమ్మ స్మారక అవార్డు ఆర్ఏఆర్ఎస్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి శ్రీదేవి అందించారు. అలాగే మల్ల జగన్నాథం స్మారక అవార్డును షేక్ షమీమ్‌కు, బెస్ట్ రీసెర్చ్ వర్కర్‌కు ఇచ్చే సుదర్శన్ రాజు స్మారక అవార్డును ఆర్ఏఆర్ఎస్ చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి. ఆదిలక్ష్మికి, ఉత్తర కోస్తా మండలి బెస్ట్ సైంటిస్ట్‌కు ఇచ్చే కొణతాల రామునాయుడు స్మారక అవార్డును కొండెం పూడి కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ రాజ్ కుమార్‌కు, ఉత్తర కోస్తా మండలంలో బెస్ట్ జర్నలిస్టు అల్లూరి సత్యనారాయణ రాజు స్మారక అవార్డు అనకాపల్లి సాక్షి విలేఖరి బివిఎన్ లోవరాజుకు, బెస్ట్ సుగర్ కేన్ మల్ల జగన్నాథం స్మారక అవార్డు ఆర్ఎఆర్ఎస్ ఆగ్రానమీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కెవి రమణమూర్తికి ప్రదానం చేశారు. బెస్ట్ ఫార్మర్ అడ్వాన్స్ అడాప్షన్ టెక్నాలజీ మల్ల జగన్నాథం స్మారక అవార్డు సన్యాసినాయుడుకు, ఉత్తర కోస్తా మండలి బెస్ట్ సైంటిస్ట్ రాగులకొల్లు చిన్న వీరయ్య స్మారక అవార్డు రాగోలు ఏఆర్ఎస్ కీటక శాస్త్రవేత్త డాక్టర్ పి ఉదయ్ బాబుకు, బెస్ట్ షుగర్ కేన్ సైంటిస్ట్ కొణతాల రామలింగస్వామి స్మారక అవార్డు పెరుమాళ్ళపల్లి ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ టిఎం హేమలతకు అందించారు. ఈ సందర్భంగా పది ప్రభుత్వ స్టాల్, 20 ప్రైవేటు స్టాళ్లు ప్రదర్శనకు ఉంచారు. వీటిలో ఉత్తమ ప్రభుత్వ స్టాల్ వ్యవసాయ శాఖ, ఉత్తమ ప్రైవేటు స్టాల్ అగ్రి టెక్, ఓవరాల్ స్టాల్ కోరమండల్ కైవసం చేసుకున్నాయి.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

28న కలెక్టరేట్ వద్ద విఆర్ఎల ధర్నా

ప్రజాశక్తి -అనకాపల్లి

వీఆర్ఏలకు కనీస వేతనాలు అమలు చేసి, అర్హులైన వీఆర్ఏలకు ప్రమోషన్ ఇవ్వాలని, నామినీలను వీఆర్ఏగా గుర్తించాలని సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సమావేశం అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వీఆర్ఏలకు కనీస వేతనాలు అమలు చేస్తానని చెప్పి హామీ ఇచ్చి మాట తప్పన్నారు. ఇప్పటికి అనేకసార్లు ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లిన ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. నామినేలుగా ఏళ్ల తరలి పని చేస్తున్న వారిని విఆర్ఎల్ గా ప్రమోషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలన్నారు. విఆర్ఎల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం జిల్లా అధ్యక్షులు రవికుమార్, కార్యదర్శి గంగాధర్, డేవిడ్, సంతోష్ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-చోడవరం

స్వయంభు వినాయక నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ మంగళవారం చోడవరంలో ఏర్పాటైంది. అధ్యక్ష కార్యదర్శులుగా రాయవరపు నానాజీ, గోల్కొండ కాశి, వైస్ ప్రెసిడెంట్, సహాయ కార్యదర్శులుగా కాపార్పు నానాజీ, సుందరపల్లి వినోద్, కోశాధికారిగా కనితి దుర్గారావు, సభ్యులుగా ఉప్పాల శ్రీను, మచుపల్లి శ్రీనివాసరావు, కణితి అప్పారావు, గాదిరెడ్డి చినబాబు, బయ్యవరపు శ్రీను ఎన్నికయ్యారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఆరోగ్యశ్రీ కొత్త కార్డులను మండలంలోని గోపాలపురం సచివాలయం పరిధిలో ఉన్న లబ్ధిదారులకు మంత్రి అమర్నాథ్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆరోగ్యశ్రీని అమలు చేస్తుందని చెప్పారు. వైద్యం కోసం పేదవారు అప్పులు చేయకుండా పూర్తి వైద్య సహాయం అందించేలా కొత్త ఆరోగ్య శ్రీ విధానాన్ని ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి రూపొందించారని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ సూరిబాబు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ దృష్టికి 79వ వార్డు సమస్యలు

ప్రజాశక్తి - పరవాడ : జివిఎంసి 79వ వార్డు పరిధి లంకెలపాలెం కోనేరులో జరుగుతున్న అభివృద్ధి పనులను జీవీఎంసీ కమిషనర్ కృష్ణకాంత్ వర్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ వార్డులో సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. చెరువు పనులు వేగంగా పూర్తి చేయాలని, అధికారులను కాంట్రాక్టర్ను, ఆదేశించారు . ఈ కార్యక్రమంలో జిఎంసి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



చెరువు పనులను పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్, కార్పొరేటర్

కుష్టు వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి -అనకాపల్లి : కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఎస్పీ కె.వి.మురళీకృష్ణతో కలిసి జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈనెల 27వ తేదీ నుండి జనవరి 12వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం జరుగుతుందని ఈ వ్యాధి లక్షణాలు ఉంటే సర్వే చేసే ఆరోగ్య కార్యకర్తలకు తెలియజేయాలని చెప్పారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రథమ స్థాయిలోనే చికిత్స చేయించుకుంటే వ్యాధి వెంటనే తగ్గిపోతుందని చెప్పారు. ఆరోగ్య కార్యకర్తల ద్వారా వ్యాధి లక్షణాలు తెలుసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్వో డాక్టర్ ఎ హేమంత్, నర్సీపట్నం ఎమ్మెల్యే పి.ఉమా శంకర్ గణేష్, డిఎల్ఓ డాక్టర్ ఎంఎస్‌వికే బాలాజీ, డిఎన్ఎమ్ఓ డాక్టర్ కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా సభ ఆగదు

ప్రజాశక్తి -అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం విజయోత్సవ సభకు అవరోధాలు కల్పిస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ఆర్టీసీ బస్సులను నమ్ముకోకుండా ప్రైవేటు వాహనాలు ఏర్పాటు చేసుకొని సభను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సిద్ధమైనట్లు చెప్పారు. అటు ఆర్టీసీ యాజమాన్యం ఇటు రవాణా శాఖ అధికారులు ఎన్ని నిర్బంధాలు పెట్టిన అరచేతిని అడ్డంపెట్టిన సూర్యకాంతిని ఆపలేనట్టుగానే తెలుగుదేశం ప్రభంజనాన్ని ఎవరు ఆపలేరని స్పష్టం చేశారు. సమావేశంలో టిడిపి బిసి నాయకులు గిరిజాల లక్ష్మణరావు, మాదంశెట్టి నీలబాబు, భీమరశెట్టి శ్రీనివాసరావు, రేసుపూడి రమణ, గుర్రం నూకరాజు, కాండ్రేగుల సత్యనారాయణ, రేసుపూడి రమణ, అడ్డు శంకర్రావు, మల్ల లోవకష్ణ, విల్లూరి రమణబాబు, కోన శ్రీను వేగి వెంకటరావు బర్ల నాగరాజు పెంటకోట ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

ప్రజాశక్తి -అచ్యుతాపురం : నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం వాటర్ మేనేజ్మెంట్ ప్లంబింగ్ సెక్టర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ వి ఎస్ ఎస్ రవికుమార్ 40 మంది నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చారు. రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికేట్, 500 రూపాయలు ప్రోత్సహకం టి షర్ట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ దర్మిరెడ్డి ప్రసాద్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ సూరిబాబు జన్మదిన వేడుకలు



ఎంపిపి సూరిబాబును సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు జన్మదిన వేడుకలు మంగళవారం గోపాలపురంలోని ఆయన స్వగృహం వద్ద అత్యంత ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఏపీఐడబ్ల్యూఎస్ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ బీవీ సత్యవతి, వైసిపి మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద, ఎన్టీఆర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ జి రామ్మూర్తి, వైసిపి యువజన విభాగం జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఎంపీటీసీలు సర్పంచులు, మండల అధికారులు పాల్గొని ఆయనకు బొకేలు దుస్సాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల మన్ననలు పొందిన సూరిబాబు రాజకీయంగా మరింత ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైసిపి శ్రేణులు, అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

దేశవాళీ గోజాతుల పరిరక్షణ అందరి బాధ్యత

రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ విజయ్ కుమార్



దేశవాళీ గో జాతులను పరిశీలిస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి -అనకాపల్లి

దేశవాళీ గోజాతుల పరిరక్షణ అందరి బాధ్యత అని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్ అన్నారు. అనకాపల్లి సత్యలక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, రాష్ట్రీయ గోకుల్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో పాడి రైతులకు, పశువులలో కృత్రిమ గర్భధారణ, లింగ నిర్ధారిత వీర్యం మీద అవగాహన సదస్సును జిల్లా పశు గణాభివృద్ధి కార్యనిర్వహణ అధికారి డాక్టర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయకుమార్ మాట్లాడుతూ గోజాతు పరిరక్షణకు ఆడ పెయ్యల ఉత్పత్తి పథకం సరైన మార్గన్నారు. అనకాపల్లి జిల్లా పశు గణాభివృద్ధి ఛైర్మన్ గాడు వెంకటప్పడు మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ద్వారా 90శాతం ఆడ పెయ్యలే పుడతాయని, 2 వీర్య నాళ్ళికల ఖరీదు రూ.1350 కాగా ప్రభుత్వ రాయితీ రూ.850 పోగా రైతు రూ.500 మాత్రమే చెల్లిస్తే చాలని చెప్పారు. ఏపీఎల్‌డిఏ అదనపు ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ రజనీ మాట్లాడుతూ మన జిల్లాలో పిండ మార్పిడి పద్ధతి ద్వారా మేలు జాతి పశువుల పిండాన్ని అద్దె పశువు గర్భంలో ప్రవేశపెట్టి పెయ్యను పుట్టించారని తెలిపారు. విజయనగరం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బంగారు నాయుడు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశీయ గో జాతుల ప్రదర్శన, లింగ నిర్ధారిత వీర్యం ద్వారా జన్మించిన ఆడ పెయ్యలు ప్రదర్శన అదనపు ఆకర్షణగా నిలిచాయి.



డస్ట్ బిన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

ప్లాస్టిక్ డస్ట్ బిన్లు పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పరిసరాలు పరిశుభ్రతలో మహిళల కీలకమైన పాత్ర పోషిస్తారని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు చెప్పారు. అచ్చుతాపురం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం తడి పొడి చెత్త వేసుకోవడానికి వీలుగా ప్లాస్టిక్ డస్ట్ బిన్నులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పట్ల దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్ న్యా సుకుమార్ వర్మ వైఎస్ఆర్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దేశం శెట్టి శంకర్రావు ,జెడ్పిటిసి సభ్యుడు లాలం రాంబాబు, పార్టీ సీనియర్ నాయకుడు కోన బుజ్జి, జడ్పీ కో ఆప్షన్ సభ్యుల నర్మల కుమార్, కె వెంకనాయుడు, శనివాడ జువాల నాయుడు, సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -అనకాపల్లి : 1990 బ్యాచ్ పోలీసులు అనారోగ్యంతో ఉన్న తమ తోటి బ్యాచ్ పోలీసు సిబ్బందికి ఆర్థిక సాయం అందజేశారు. తమ తోటి పోలీసులకు, పేద విద్యార్థులకు ఆర్థికంగా సహాయ పడాలనే ఉద్దేశంతో శక్తి పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసి ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లాకు చెందిన పోలీసు సిబ్బంది ప్రతినెల రూ.500 వేసుకొని కష్టకాలంలో తోటి వారిని, పేద విద్యార్థులను ఆదుకుంటున్నారు. ఇందులో భాగంగా అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్న ఎఎస్ఐలు పి.గోవిందు, ఈ.అప్పారావు, హెడ్ కానిస్టేబుళ్లు కె.ఎల్.నూకేశ్వరరావు, ఎన్.అప్పారావు, నూకరాజు, జ్వాలాముకుందలకు మొత్తం రూ.1,10,000 ఆర్థిక సహాయంగా అందజేశారు. చికిత్స పొందుతున్న ఆసుపత్రులకు, డిశ్చార్జ్ అయ్యి ఇంటి వద్ద ఉన్న పోలీసు కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు సాయం అందజేశారు. కార్యక్రమంలో అనిల్, మిలటరీ నాయుడు, వెంకటేశ్వరరావు, సుబ్బరాజు, రమేష్, లక్ష్మణరావు, సింహాచలం, బాబురావు, రఘు, బీశెట్టి వెంకటేశ్వరరావు, నారాయణ, పూర్ణచంద్ర, నాయుడు నర్సింగరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రకృతి వ్యవసాయంపై జిల్లాలో రైతాంగానికి అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు అధికారి సిహెచ్ లచ్చన్న పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లాలో ఫార్మర్ సైంటిస్ట్ కోర్స్ రీజనల్ ట్రైనింగ్ మంగళవారం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో పాల్గొన్న ఫార్మర్ సైంటిస్టు, మెంటర్స్ శిక్షణ పట్ల అవగాహన కల్పించుకుని రైతులకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా ఐజిజిఎఏఆర్ఎల్ అకాడమీ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి మెటీరియల్స్ అందించారు. కోర్సులో భాగంగా ప్రతి ఒక్కరూ పరీక్షలలో ఉత్తీర్ణవ్వాలని, ప్రతి ఒక్కరు మీరు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని అందరిని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారైన ఆర్టీవో హేమసుందర్, డిపిపి, టిపిపిలు పాల్గొన్నారు.

అనాథలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : మండలంలోని వెంకన్నపాలెం గ్రామానికి చెందిన కరక గోవింద మంగళవారం వికలాంగ అనాథలకు భోజనాలు ఏర్పాటు చేసి, చలికాలంలో చలి నుండి రక్షణకు అవసరమైన దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా వారు గోవిందకు కృతజ్ఞతలు తెలిపారు.



దుప్పటి అందజేస్తున్న గోవింద

కొనసాగిన సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసనలు



చోడవరంలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి-చోడవరం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిగారు ఇచ్చిన హామీ ప్రకారం తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ మండల విద్యాశాఖ, సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన పెన్‌డౌన్, నిరసన కార్యక్రమాలు మంగళవారం కూడా కొనసాగాయి. ఈ మేరకు స్థానిక మండల విద్యాశాఖాధికారి వారి కార్యాలయం వద్ద మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేసారు. తమను రెగ్యులర్ చేయాలని చేయాలని, కనీసం అలవెన్సులతో కూడిన సమానపనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్స్‌ను పరిష్కరించకపోతే 20వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఒప్పంద ఉద్యోగులు, సిఐటియు నాయకులు శ్రీనివాసరావు, మిడ్డేమీల్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి పాల్గొన్నారు.

అనందపురం : సిఎం జగన్ ఇచ్చిన హామీల అమలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని సమగ్రశిక్ష ఉద్యోగుల ఆందోళనలో భాగంగా మంగళవారం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. తమ డిమాండ్లను నెరవేర్చకుంటే ఈనెల 20 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు.

భీమునిపట్నం : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ, సమగ్ర శిక్ష ఉద్యోగుల పెన్‌డౌన్ ఆందోళన మంగళవారం కొనసాగింది. స్థానికమండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో జాతి నేతల విగ్రహాల వద్ద ఆందోళన చేపట్టారు. తమను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్ల కార్డులు ప్రదర్శించారు. సమగ్రశిక్ష ఉద్యోగుల ఆందోళనకు సిఐటియు భీమిలి జోన్ కమిటీ మద్దతు తెలిపింది. కార్యక్రమంలో జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, సమగ్ర శిక్ష ఉద్యోగులు దయాళ్, త్రినాధ్, వంశీ ధర్, సూర్యనారాయణ, నరసింగరావు, రామభద్రరాజు పాల్గొన్నారు



ఆనందపురంలో మోకాళ్లపై...

పద్మనాభం: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద సమగ్రశిక్ష ఉద్యోగుల పెన్‌డౌన్ ఆందోళన కొనసాగింది. తమ న్యాయమైన 15 డిమాండ్లను నెరవేర్చకుంటే ఈనెల 20 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కాగా సమగ్రశిక్ష ఉద్యోగుల ఆందోళనకు పలు ఉపాధ్యాయసంఘాలు సంఘీభావం ప్రకటించాయి. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు అప్పలకొండ, పుష్పవతి, బుచ్చిబాబు, బంగారు నాయుడు, గౌరి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : సమగ్ర శిక్ష సిఆర్పిలు కంప్యూటర్ ఆపరేటర్లు, స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. తల కిందులుగా ఉండి వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు జి.శ్రీను, కామలక్ష్మి పోలరాజు, వెంకటరావు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులు నాల్గో రోజు పెన్ డౌన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ కార్యాలయం వద్ద ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ, సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు.ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ఈ నెల 20వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు.

దేవరాపల్లి : మండల కేంద్రంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఉద్యోగులు చేపట్టిన అందోళనకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న, ఏపీటీఎఫ్, యుటిఎఫ్ యూనియన్‌ల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పిపార్వతి, సిహెచ్ రమేష్ యం శ్రీను పి గంగాధర్ వివి, రమణ, కె మాధవి, పిబియస్ ఉపేంద్ర, వైసాగర్, టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంగళవారం సమగ్రశిక్షా ఉద్యోగులు నల్ల రిబ్బన్‌లు ధరించి, ప్లకార్డులతో స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. తక్షణమే మినిమం టైం స్కేల్ అమలు చేసి వేతనాలను పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమానపనికి సమానవేతనం ఇవ్వాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పీలు శేఖర్, అప్పారావు, నాయుడు, జ్యోతి, దేవి, డేటా ఎంట్రీ ఆపరేటర్ శివ, ఝాన్సీ, రత్నరాజు పాల్గొన్నారు.




బుచ్చయ్యపేటలో తలకిందులుగా...

రావికమతం : మండల విద్యాశాఖ, సమగ్ర శిక్ష లో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులు మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు రామారావు, సత్యనారాయణ, హేమ సుందర్‌రావు, పెంటయ్య పాల్గొన్నారు.

రోలుగుంట : సమస్యలు పరిష్కరించాలని పెన్ డౌన్ చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు సిఐటియు, గిరిజన సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రోలుగుంట ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.శంకరరావు, గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు మాట్లాడుతూ, తక్షణమే సమస్యలు పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

భిక్షాటన

కశింకోట : కశింకోటలో విద్యాశాఖ-సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులు తమ హక్కుల సాధన కొరకు మూడవ రోజు పెన్‌డౌన్ కొనసాగించారు. ఇందులో భాగంగా మండలంలో పనిచేస్తున్న సిఆర్ఎంటిలు, డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంటెంట్, పిటిఐలు ఖాళీ పాత్రలతో భిక్షాపన చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు డి.లక్ష్మణ, పి సత్తిబాబు, ఝాన్సీ, రామలక్ష్మి, సురేష్,సత్యారావు, సూర్యదాసు పాల్గొన్నారు.



కశింకోట ధర్నా శిబిరంలో భిక్షాటన చేస్తున్న దృశ్యం


విధుల్లోకి తీసుకోకుంటే

ఆత్మహత్యకు అనుమతి కోసం హైకోర్టును ఆశ్రయిస్తా

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కార్మికుడు బుద్ద రామకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి

తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం తనను తిరిగి విధుల్లోకి తీసుకోకుంటే ఆత్మహత్యకు అనుమతి కోరుతూ హైకోర్టును ఆశ్రయిస్తానని ఫ్యాక్టరీలో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన బుద్ధ రామకృష్ణ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం రామకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. తాను తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలో 32 ఏళ్లపాటు విధులు నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2021 ఏప్రిల్ 30న స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసినట్లు చెప్పారు. తనకు 2020 జూలై 1 నుంచి వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యూటీ వగైరాలు సుమారు 15 లక్షల రూపాయల వరకు రావాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే తనతోనే స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన కొంతమందిని ఫ్యాక్టరీ యాజమాన్యం విధుల్లోకి తీసుకొని వేతనాలు చెల్లిస్తుందని, తనను తీసుకోవడం లేదని తెలిపారు. దీంతో తన కుమారుని సాంకేతి విద్యకు పరీక్ష ఫీజు కట్టలేని స్థితి నెలకొందని చెప్పారు. తమ కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చకపోవడంతో అప్పుల వారు ఇంటి పైకి వచ్చి రభస చేయడం, కోర్టులకు వెళ్లడం వంటి పరిస్థితుల్లో తన భార్య తీవ్ర అనారోగ్యానికి గురైందని పేర్కొన్నారు. తను కాలేయ వ్యాధితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకోవాలని డాక్టర్లు సూచించారని చెప్పారు. తనకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టరు, ఫ్యాక్టరీ పర్సన్ ఇన్చార్జికు ఎన్నిసార్లు వినతులు సమర్పించిన సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తన కుమారుని భవిష్యత్తు, తన భార్య, తన అనారోగ్య పరిస్థితి, కుటుంబ పోషణ భారం నేపథ్యంలో తనకు ఆత్మహత్యకు అనుమతి ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన అర్జీని సుగర్స్ యాజమాన్యానికి అందించేందుకు ఫ్యాక్టరీకి వెళితే అధికారులెవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు న్యాయం చేయకుంటే ఆత్మహత్య కోసం హైకోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు.



బుద్ద రామకృష్ణ

అల్యూమినియం కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : సంక్షోభంలో ఉన్న అల్యూమినియం పరిశ్రమలను ప్రభుత్వం ఆదుకొని కార్మికులకు ఉపాధి కల్పించాలని ఏఐటియుసి అనకాపల్లి జిల్లా కన్వీనర్ వై.ఎన్.భద్రం డిమాండ్ చేశారు. అల్యూమినియం వర్కర్ల వన సమారాధన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ఉన్న చిన్న అల్యూమినియం పరిశ్రమలకు ముడిసరుకు కొరత, అల్యూమినియం పాత్రలు వాడకం తగ్గి ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక పరిశ్రమలు మూత పడుతున్నాయని తెలిపారు. దీంతో అందులోని పని చేస్తున్న కార్మికుల ఉపాధి కోల్పోయి వలసలు వెళ్లి కూలి పని చేసుకోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నీలకంఠ శ్యాము, పెంటకోట ప్రసాద్, కోశాధికారి కొండూరి గిరిబాబు, ఎఐటియుసి నాయకులు కొండూరు వీరాచారి, సిపిఐ మాజీ కౌన్సిలర్ తాకాసి వెంకటేశ్వరరావు, కార్మిక నేతలు పెంటకోట వాసు, మద్దాల అప్పారావు, శంకర్రావు, కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వెన్నెలపాలెం గ్రామంలో ఇటీవల మరణించిన బండారు ప్రసాద్ కుటుంబ సభ్యులకు మంగళవారం వైఎస్ఆర్ బీమాలో భాగంగా తక్షణ సహాయం కింద 10 వేలు రూపాయలు సర్పంచ్ వెన్నెల అప్పారావు చేతులు మీద అందజేశారు. మిగతా 4,90 లక్షలను నామినీ అకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, సచివాలయం మరియు వాలంటీర్స్ సిబ్బంది, స్థానిక వార్డు మెంబర్ బండారు నాయుడు, కన్వీనర్ వెన్నెల సింహాద్రి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

పలుచోట్ల ఎపికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాలు



బుచ్చయ్యపేటలో మాట్లాడుతున్న కొండబాబు

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ఎడ్లవీధి సచివాలయంలో మంగళవారం ఎపి నీడ్స్ జగన్, పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల డిజిటల్ బోర్డును సచివాలయంలో ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు ఎంత లబ్ధి చేకూరింది అన్న వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఇఒ నారాయణరావు, సర్పంచ్ బండి నుకాలమ్మ శ్రీను, మండల కన్వీనర్ పతివాడ అప్పారావు, వార్డు మెంబర్లు ఒరుగంటి నాగమణి, పసుమర్తి సంతోష్ రాము, చిటికెల నాగేష్, ఎంపీటీసీ పొట్నూరు అరుణ, సచివాలయం కన్వీనర్, ఒరుగంటి నెహ్రూబాబు ఇతర నాయకులు పాల్గొన్నారు.

కశింకోట : ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం మండలంలోని అచ్చెర్ల సచివాలయంలో మంగళవారం జరిగింది. ఎంపీపీ కలగ లక్ష్మీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత జగన్‌దే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చెర్ల సర్పంచ్ నిమ్మదాల సోమేస్వరావు, ఈవోపీఆర్డి ఎన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేశాం

వేపగుంట : గత ప్రభుత్వం మాటలు చెప్తే, తాము చేతల్లో చేసి చూపించి హామీలన్నీ అమలు చేశామని స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అన్నారు. మంగళవారం 94వ వార్డు అప్పలనరసయ్య కాలనీలో ఎపికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో వైసిపి పాలనలో చేపట్టి, అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన జగన్మోహనరెడ్డిని మళ్లీ సిఎంను చేయాలని కోరారు. కాలనీలో పలు సమస్యలను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ దృష్టికి వైసిపి నగర ప్రతినిధి వై.నాగేశ్వరరావు తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైసిపి నేతలు జగదీష్, బండి సత్తిబాబు, కార్తీక్ వర్మ, తామర్ల నర్సింగరావు పాల్గొన్నారు

బుచ్చయ్య పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు జాగా కొండబాబు తెలిపారు. మంగళవారం ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ క్యాలెండర్ను ఆవిష్కరించారు. వైయస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణమూర్తి, సుంకర శ్రీను, సుంకర గాంధీ, శనివాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే



కోటవురట్లలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కోటవురట్ల: మండలంలో సోమవారం జగనన్న ఎందుకు కావాలి అనే కార్యక్రమం పి కొత్తపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ వై బెన్నమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వైసిపి అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు హాజరై ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లోకవరపు బాబులు, శ్రీనివాసరావు, జోగారావు శ్రీనివాసరావు, పలువురు మాజీ ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు,వైసిపి నాయకులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్

పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లిలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఈపిడిసిఎల్ కార్యాలయం వెనుక గల విస్తరణ పనులకు కొలతలు తీయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వేగవంతంగా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, నాయకులు బేతిరెడ్డి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోటలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. స్థానిక భవన యజమానుల కోరిక మేరకు మంగళవారం మరో మారు మార్కింగ్ పనులు చేపట్టారు. నర్సీపట్నం ఆర్ అండ్ బి శాఖ ఇన్ ఛార్జ్ జెఈ నారాయణరెడ్డి, రావికమతం మండల సర్వేయర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సర్వే పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా జెఈ నారాయణరెడ్డి మాట్లాడుతూ, రోడ్డు విస్తరణలో భాగంగా ఆర్అండ్‌బి నిబంధనల ప్రకారం రోడ్డు మధ్య నుంచి అటు, ఇటు గా 30 అడుగుల మేర మార్కింగ్ చేస్తున్నట్లు చెప్పారు. ఇరు వైపులా సుమారు ఐదు అడుగుల చొప్పున కాలువలు నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. స్థానిక పంచాయతీ తీర్మానం మేరకు విస్తరణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పందల దేవ, ఎంపిటిసి పూడి దేవ, మాజీ ఉప సర్పంచ్ కే.గున్నాజీ పాల్గొన్నారు.



మార్కింగ్ చేస్తున్న సిబ్బంది



సమీక్షిస్తున్న నేతలు

యువగళం సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-రోలుగుంట: విజయనగరం జిల్లా పోలిపల్లిలో ఈనెల 20న నారా లోకేష్ నిర్వహించనున్న యువగళం పాదయాత్ర ముగింపు సభను విజయవంతం చేయాలని చోడవరం మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు పిలుపునిచ్చారు. మంగళవారం రోలుగుంటలో యువగళం ముగింపు సభపై టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మండల పరిధి నుంచి 3వేల మందికిపైగా ముగింపు సభకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



ట్రాక్టర్లలో తరలిస్తున్న నేతలు

పజాశక్తి-మాకవరపాలెం: మాకవరపాలెం మండలం తూటిపాల రెవెన్యూలో పట్టపగలే ఇసుక అక్రమంగా రవాణా అవుతుంది. అయినా అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. సచివాలయం కనుసన్నల్లోనే జరగడం గమనార్హం. నిత్యం ఇక్కడ ట్రాక్టర్లపై ఇసుక తరలి పోతుంది. ఒక్కో ట్రాక్టర్ ఇసుక 5వేలపై బడి విక్రయిస్తున్నారని తెలిసింది. ఇప్పటికైనా అక్రమ ఇసుక రవాణాను అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బూరుగుపాలెం వద్ద పోలీసులు పట్టుకోవడం గమనార్హం.



తవ్వుతున్న ఇసుక

ఎపిటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నక్కపల్లి: ఏపీటీఎఫ్ కార్యవర్గం నూతనంగా ఎన్నికైంది. ఈ మేరకు సభ్యులు ఎంఈఓ నరేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఏపీటీఎఫ్ అధ్యక్షులుగా వై.కృష్ణ, కార్యదర్శిగా సి.హెచ్ అప్పలరాజు, గౌరవాధ్యక్షులుగా ఎస్.ఫల్గుణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ సమస్యలను ఎంఇఒకు తెలియజేశారు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను దాడిశెట్టి కొండలరావు, జిల్లా సబ్ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు వెంకటపతిరాజు తదితరులు అభినందించారు.



వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

సరిహద్దు వివాదం పరిష్కారం

ప్రజాశక్తి- చీడికాడ: ఇరు వర్గాల మధ్య రెండేళ్లుగా కొనసాగుతున్న సరిహద్దు వివాదం ఎట్టకేలకు పరిష్కరించడం జరిగిందని రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ పి.గోవింద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని మంచాల గ్రామంలో సర్వే నెంబర్ 105, 114 లలో భూమి మధ్య సరిహద్దుపై గ్రామానికి చెందిన పాటూరి రమణ, తో పాటు మరో వర్గం ముగ్గురు వ్యక్తులతో వివాదం నెలకొంది. అయితే సరిహద్దులో గల తాటి చెట్లను నరసింహమూర్తి వర్గం అక్రమంగా నరికేసారని పాటూరి రమణ 2021 ఆగస్టులో పోలీసులకు తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అప్పటినుండి పలుమార్లు సర్వేలు నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినప్పటికీ ఇరువర్గాలు అంగీకరించకపోవడంతో ఇప్పటివరకు వివాదం కొనసాగుతుందన్నారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశం మేరకు తహసిల్దార్ సూచనలతో సోమవారం మంగళవారం స్థలాలను మరల సర్వే నిర్వహించి సరిహద్దులో సర్వే రాళ్లను పాతించడం తో వివాదం పరిష్కారం జరిగిందన్నారు. అయితే పాటూరి రమణ సరిహద్దులో గల 34 తాటి చెట్లను ప్రత్యర్థి వర్గం నరికించినట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఈ నివేదికను తహసిల్దార్ కు సమర్పించడం జరుగుతుందని, ఈ తాటి చెట్ల వివాదం స్టేషన్లో ఫిర్యాదు చేసి ఉండడంతో తహసిల్దార్ నివేదికను పోలీసులకు సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ కుమారస్వామి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఏ కష్ణంరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సర్వే చేపడుతున్న సిబ్బంది

విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత

ప్రజాశక్తి - చింతపల్లి: రాష్ట్రంలోని విద్యార్థులు అందరికీ అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా విద్యాభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. స్థానిక సిఏహెచ్ పాఠశాలలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, విద్యా వ్యవస్థను డిజిటలైజేషన్ చేయడానికి, జీఆర్ ఈ, టోఫెల్ వంటి పరీక్షలు రాయడానికి విద్యార్థుల సామర్థ్యం పెరగడానికి ముఖ్యమంత్రి రూపకల్పన చేశారని చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్లు పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 21న చింతపల్లిలో చేపడుతున్నామన్నారు.



గ్రామసభ నిర్వహిస్తున్న ఎంపి ఛైర్మన్

'ఉపాధి' పనులపై గ్రామసభ

ప్రజాశక్తి-గొలుగొండ: ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపిసి ఛైర్మన్ కొల్లు సత్యనారాయణ, సర్పంచ్ కొల్లు రమణమ్మ కోరారు. మంగళవారం గొలుగొండ మండలం రావణాపల్లి గ్రామ సచివాలయం వద్ద ఉపాధి హామీ పనులపై గ్రామసభ నిర్వహించారు. రెండు రోజులుగా గ్రామంలో డిఆర్‌పి వెంకటేష్, టిఎ చైతన్య గ్రామంలో పర్యటించి ఎన్ఆర్ఇజిఎస్ పనులు చేసే మహిళలు, పురుషులతో మాట్లాడారు. సక్రమంగా చేసిన పనికి డబ్బులు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ గ్రామసభలో ఎస్ఆర్‌పి సూర్యనారాయణ, గ్రామ పంచాయతీ సెక్రటరీ సాధనాల అప్పారావు, వీఆర్పీ మడగల సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది లక్ష్మీ, శ్రీలక్ష్మీ, మనోజ్, నవీన్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న న్యాయవాదులు

కొనసాగిన న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూహక్కుల చట్టం (ఎపి ల్యాండ్ టైటిలింగ్ చట్టం 27, 2023)ను వెంటనే రద్దు చేయాలని నర్సీపట్నం బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ చట్టం అక్టోబరు 31 నుండి అమల్లోకి వచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబరు 512 జారీ చేసిందన్నారు. ఈ చట్టం ఉద్దేశ్యం ప్రజల స్థిరాస్థుల విషయంలో వివాదాలు ఏర్పడినప్పుడు ఆ వివాదాలను పరిష్కరించే అధికారం సివిల్ కోర్టుల పరిధి నుండి తప్పించి ప్రభుత్వం ఏర్పాటు చేసే జిల్లా స్థాయి ట్రిబ్యూనల్ కు అధికారానివ్వడం, ఉత్తర్వులపై నేరుగా హైకోర్టుకు మాత్రమే అప్పీలు చేసుకునే అధికారాలు ఇచ్చారన్నారు. సామాన్యులు హైకోర్టులో పిటిషన్ వేసుకోవడమంటే చాలా డబ్బు ఖర్చు పెట్టడమే కాకుండా చాలా ప్రయాస పడాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వైసిపి ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని ఇసుక అక్రమ రవాణా వ్యాపారానికి అడ్డుపడుతున్నారనే కారణం తో హుకుంపేట తహాశీల్దార్ రాజ్యలక్ష్మి పై దాడికి ప్రయత్నం చేసిన తీగలవలస అధికార వైసీపీ సర్పంచ్ పాంగి బేసు, కొడుకు అర్జున్, తీగలవలస ఎంపిటీసీ కొర్ర నాగరాజులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకురాలు సొంటేన హైమావతి, మండల కార్యదర్శి లక్ష్మణ్, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావులు డిమాండ్ చేశారు. స్థానిక విలేకర్లతో వారు మంగళవారం మాట్లాడుతూ,మండలంలోని దిగుడుపుట్టు, తీగలవలస పంచాయితీ గరుడాపల్లి, కొట్నాపల్లి పంచాయితీ కోట్నాపల్లి గ్రామాలలో లక్షల విలువైన ఇసుక అక్రమంగా తవ్వి, లోడ్‌కు రూ 3000 నుండి రూ 6000 అమ్ముకుంటున్నారన్నారు. స్థానిక పంచాయితీ గిరిజన ప్రజలు ఇల్లు కట్టుకోవాలంటే ఇసుక దొరక లేదని చెపుతూ మాఫియాదారులుగా మారుతున్నారన్నారు. తీగలవలస సచివాలయం పేరిట రశీదులు ముద్రించి దర్జాగా ఇసుకను అమ్ముకుంటున్నారన్నారు.

బెదిరేది లేదు..

పలుచోట్ల అంగన్‌వాడీల వంటావార్పు, మానవహారాలు


రావికమతంలో వంటావార్పు చేపడుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

అంగన్‌వాడీ కేంద్రాలకు తాళాలు వేసి ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతున్నా అదిరేది లేదని అంగన్‌వాడీలు తేల్చి చెప్పారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో పలు చోట్ల అంగన్వాడీల వంటా వార్పు, భిక్షాటన, ధర్నాలు చేపట్టారు. మంగళవారం 8వ రోజు కూడా సమ్మెను ఉధృతంగా కొనసాగించారు

రావికమతం: మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో అంగన్వాడీలు సమ్మె లో భాగంగా వంటా వార్పు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి శంకర్రావు మాట్లాడుతూ, అంగనవాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేవరకు ఎట్టి పరిస్థితుల్లో సమ్మెను విరమించేది లేదని తెలిపారు. అధికారులతో అంగన్వాడీల కేంద్రాల తలుపులను పగలగొట్టి వేరే శాఖల సిబ్బందికి బాధ్యత అప్పగించడం చాలా దారుణమన్నారు. ఇటువంటి పరిస్థితి గతంలో ఆర్టీసీ సమ్మె చేసినప్పుడు ఇదేవిధంగా అప్పటి ప్రభుత్వం ప్రైవేట్ డ్రైవర్లను, కాలేజి స్టూడెంట్‌లను నియమిస్తే ఏ రకమైన పరిస్థితి ప్రభుత్వానికి ఎదురయ్యిందో ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి నెలకొంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి సత్యవేణి, అధ్యక్షులు బి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. స్థానిక శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం అప్పలరాజు మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయక పోవడం దుర్మార్గమన్నారు. అంగన్వాడి సెంటర్ తాళాలు పగలగొట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సత్యనారాయణ, బత్తి నాగేశ్వరరావు, అంగన్వాడి జిల్లా అధ్యక్షులు దుర్గారాణి, సుబ్బలక్ష్మి, పి సీతారత్నం, జిల్లా ఐకెపి జిల్లా అధ్యక్షులు రూపా దేవి చల్లపల్లి రాజేష్ పాల్గొన్నారు.

గొలుగొండ: గొలుగొండలో అంగన్వాడీలు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ తమకు కనీస వేతనం 26వేలు చేయాలని, సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగొచ్చే వరకూ సమ్మె కొనసాగుతుందని వారు చెప్పారు.

నర్సీపట్నం టౌన్: అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేపడుతున్న నిరవధిక సమ్మె నర్సీపట్నంలో ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వంటా వార్పు నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ టి.ఈశ్వరరావు, అంగన్వాడీ ప్రాజెక్టు నాయకులు వి.సామ్రాజ్యం, డి.మహాలక్ష్మీ, కృష్ణవేణి, వరలక్ష్మీ పాల్గొన్నారు.

కోటవురట్ల: అంగన్వాడీ కేంద్రాలపై రెవెన్యూ, సచివాలయ, పోలీసు సిబ్బంది ముప్పేట దాడి నిర్వహించి బలవంతంగా తెరిపించి నిర్వహిస్తున్నారు. దాదాపు 82 కేంద్రాలలో 60 కేంద్రాల వరకు తెరిపించినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్లు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది తెలిపారు. కొన్ని కేంద్రాలలో టిడిపి నాయకులు నిలువరించినా తాళాలు పగలగొట్టి కేంద్రంలోకి చొరబడ్డారు.

మాడుగుల: అంగన్వాడి కేంద్రాల తాళాలు బద్దలు కొట్టి సచివాలయ వాలంటీర్లతో తెరిచినట్లుగా నటిస్తున్న జగన్మోహన్ రెడ్డి నటనలు మానుకోవాలని సిపిఎం నాయకులు డి వెంకన్న అన్నారు. నియోజకవర్గ కేంద్రం బస్టాండ్ ఆవరణలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమ్మె కార్యక్రమంలో వెంకన్న పాల్గొని మాట్లాడారు. గతంలో అనేక ప్రభుత్వాలు అంగన్వాడీలపై కక్షపూరిత చర్యలు నిర్వహించాయని, వారందరికీ తగిన శాస్తి జరిగిందని ఆయన అన్నారు.


కశింకోటలో...

కశింకోట: కసింకోటలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్వాడీలు మంగళవారం శిబిరం వద్ద వంటా వార్పు నిర్వహించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు డిడి వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా నాయకులు శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు తనుజ, కృష్ణవేణి, కాసలమ్మ, ఉమనారాయణమ్మ, వరలక్ష్మి, శ్యామల, పార్వతి, జ్యోతి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు

బుచ్చయ్యపేట : అంగన్వాడీ కార్యకర్తలు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సిఐటియు అధ్యక్షులు ఆర్ శంకరరావు మాట్లాడారు. మండల విద్యాశాఖ అధికారి రాజుకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆది వరలక్ష్మి, ఎలిశెట్టి అమ్మాజీ, వెంకటలక్ష్మి, పైడితల్లమ్మ, చిలకమ్మ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలం, తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు 8వ రోజు ఆందోళనలో భాగంగా వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ చందక రామకృష్ణ, యూనియన్ నాయకులు బద్ది మంగ, నూకరత్నం, సుజాత, సంతోషి, సావిత్రి, రమణమ్మ పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : మండల కేంద్రం మునగపాకలో అంగన్వాడీలు చేపట్టిన ఆందోళన కార్యక్రమం మంగళవారం నాటికి ఎనిమిదవ రోజుకు చేరుకుంది. శిబిరంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ, జిల్లా కవులు రైతు సంఘం నాయకులు ఆళ్ల మహేశ్వర రావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు ఆడారి రామలక్ష్మి, జయలక్ష్మి, హేమలత, ఉమా, సరస్వతి, నాగమణి, అంజలి, తులసి లక్ష్మి , లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : అంగన్వాడీ వర్కర్ల సమ్మె 8వ రోజు సందర్భంగా స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఆవరణలో మంగళవారం వంటావార్పు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి కుమారి, సిఐటియు నాయకులు గండి నాయన బాబు ఎర్ర దేవుడు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ తాసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు సమ్మె 8వ రోజుకు చేరుకుంది. మంగళవారం శిబిరం ఎదుట వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, యూనియన్ నాయకులు సిహెచ్ దేవి, జి అమ్మాజీ, అక్కమ్మ, ఎం రమణి, పార్వతి, కష్ణవేణి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం అంగన్వాడీ కార్యకర్తలు వంటావార్పు కార్యక్రమం చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము తన మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వరలక్ష్మి, బి జయలక్ష్మి, ఎల్.రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.


రాంబిల్లిలో...



మాడుగులలో...

కేంద్రాల తెరవడం అడ్డగింత

బుచ్చయ్యపేట : ఒక వైపు అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళనలో ఉంటే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అంగన్వాడీ కేంద్రాల తాళాల పగల కొట్టడంలో నిమగ్నమయ్యారు. మండలంలో దిబ్బిడి అంగన్వాడి కేంద్రం తాళం పగలగొట్టడంతో స్థానికులు అడ్డుకున్నారు. వడ్డది 5వ అంగన్వాడీ కేంద్రం వద్ద మహిళా వాలంటీర్లు నైటీలతో విధులకు రావడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు.

వడ్డాది : మండలంలో బంగారు మెట్ట, ఎల్బిపి అగ్రహారం, లోపూడి 1 2, ఎల్ సింగవరం తదితర అంగన్వాడి కేంద్రాలను పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యాన తాళాలు పగలకొట్టి స్వాధీనం చేసుకున్నారు. వడ్డాదిలో 8 అంగన్వాడి కేంద్రాలు ఉండగా 6వ నెంబర్ అంగన్వాడి కేంద్రంలో మంగళవారం మెనూ ప్రకారం పులిహోర పెట్టవలసి ఉండగా, చప్పటి పప్పు అన్నంతో పిల్లలకు పెట్టి మమ అనిపించారు. మిగిలిన ఏడు సెంటర్లకు అంగన్వాడీ సిబ్బంది లేకుండా పిల్లలను పంపించబోమని స్థానికులు స్పష్టం చేశారు.

ఒంటికాలిపై భిక్షాటనతో వినూత్న నిరసన

విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాడతామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు వై.తులసి అన్నారు. జివియంసి గాంధీ విగ్రహం వద్ద తలపెట్టిన సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. తొలుత లలిత జ్యూయలర్స్, ద్వారక బస్‌స్టాండ్, ఎల్ఐసి, అంబేద్కర్ విగ్రహం, ఉమెన్స్ కాలేజ్, రామ్‌నగర్ జంక్షన్ మీదుగా జివిఎంసి వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడ గాంధీ విగ్రహం ఎదుట మానవహారం నిర్వహించారు. అంగన్‌వాడీల పోరాటానికి టిడిపి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, బిహెచ్ఇఎల్ యూనియన్ నాయకులు జిటిపి.ప్రకాష్, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంఘాల రాష్ట్ర కార్యదర్శి కట్టా మల్లేశ్వరరావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు శరత్, రెహ్మాన్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మురళీధర్, సిఐటియు నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జి.అప్పలరాజు, ఎం.సుబ్బారావు, పి.వెంకటరావు, శివ, ఎఐటియుసి నాయకులు పడాల రమణ, శంకరరావు, సత్తిబాబు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పి.మణి, నాయకులు వెంకటలక్ష్మి, నాగేశ్వరి, నూకరత్నం, కృప, శ్యామలాదేవి, నర్సయమ్మ, దేవి, కుమారి, ఇందిర, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఆనందపురం : తమ సమస్యల పరిష్కారానికి ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఒంటి కాలిపై నిలబడి భిక్షాటన చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం నుండి ఆనందపురం జంక్షన్ వరకు భారీ ర్యాలీ, భిక్షాటన చేపట్టి, ఆనందపురం జంక్షన్‌లో భారీ మానవహారం నిర్వహించారు. సిఐటియు జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి, అంగనవాడీ ప్రాజెక్ట్ యూనియన్ గౌరవాధ్యక్షులు వెంకటలక్ష్మి ప్రాజెక్టు నాయకులు పద్మ , శ్రీదేవి, లక్ష్మీ, కొవ్వాడ లక్ష్మి, దుర్గ, సిఐటియు నాయకులు రవ్వ నర్సింగరావు, ఆనందపురం, పద్మనాభం, భీమిలి అంగన్వాడీలు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు కొమ్మాది గ్రామస్తులు మద్దతు

పిఎం పాలెం : వేతనాల పెంపు, ఉద్యోగభద్రత, ఇతర న్యాయమైన సమస్యలతో ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు కొమ్మాదిలో గ్రామప్రజలు బహిరంగ సంఘీభావం తెలిపారు. మంగళవారం కెవిపిఎస్ నాయకులు సియాద్రి పైడితల్లి ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు, పిల్లల తల్లిదండ్రులు ప్లకార్డుల పట్టుకుని, నినాదాలు చేస్తూ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తులసమ్మ, ఎస్ నరసియ్యమ్మ, యు తాతారావు, ప్రతాప్, ఎస్ సాయి, ఎస్ అప్పారావు, సాదమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.